# ఉత్తరకొరియాపై వాస్తవాలు మరుగుపరిచే ప్రచారం

**ఉత్తరకొరియా** అణుబాంబు, క్షిపణిల తయారీతో ప్రపంచానికి పెను ప్రమాదాన్ని తెచ్చిపెట్టిందనీ, ఈ దుండగీడుకు గుణపాఠం చెబుతాననీ అమెరికా సామ్రాజ్యవాదం వీరంగం వేస్తున్నది. ఉత్తర కొరియాపై సైనిక దాడి చేస్తానని బెదిరిస్తున్నది. ఈ ప్రచార దుమారంతో దాచిన వాస్తవాలను మననం చేసుకోవాల్సి వుంది.

ఉత్తర కొరియాలో విదేశీ సైన్యాలేవీ లేవు. జపాను సామ్రాజ్యవాద దురాక్రమణకు వ్యతిరేకంగా గెరిల్లా యుద్ధం చేస్తున్న కొరియా ప్రజలకు అండగా వచ్చిన సోవియటు సైన్యం రెండవ ప్రపంచ యుద్ధం ముగియటంతో 1948లోనే తిరిగి వెళ్ళిపోయాయి.

విజయపరంపరతో సాగుతున్న కొరియా ప్రజా గెరిల్లా పోరాటాన్ని నిలువరించేందుకు అమెరికా సామ్రాజ్యవాదం 1950లో కొరియాపై దురాక్రమణకు పూనుకుంది. కొరియా ప్రజలకు అండగా నవ చైనా ప్రజా సైన్యం కొరియా వచ్చింది. తన తైనాతీలతో కొరియాను ఉత్తర, దక్షిణ కొరియాలుగా అమెరికా సామ్రాజ్యవాదం విడగొట్టింది. దీనికి ఒప్పందం కుదరటంతో 1953లో చైనా ప్రజా సైన్యం తిరిగి వెళ్ళిపోయింది. ఆనాటి నుండి విదేశీ సైన్యాలు ఉత్తర కొరియాలో లేవు.

దక్షిణ కొరియాలోనే ఆనాటి నుండి అమెరికా సైన్యాలు తిష్టవేసుకుని కూర్చున్నాయి. ఇప్పటికీ 28 వేలకు పైగా అమెరికా సైనికులు అక్కడ వున్నారు. ఆ చిన్న దేశంలో 48 సైనిక స్థావరాలను అమెరికా నిర్మించింది. ప్రతి సంవత్సరం కొరియా ద్వీపకల్పం చుట్టూ సైనిక విన్యాసాలు చేస్తున్నది. ఈ స్థావరాల నుండి అమెరికా, ఉత్తరకొరియా ప్రభుత్వాన్ని కూల్చేందుకు అనేక రకాలుగా ప్రయత్నించింది. దిగ్బంధనం విధించి ప్రజలకు ఆహారమందకుండా చేసింది. లెక్కలేనన్ని సైనిక, గూఢచారి దాడులు సాగించింది. కొరియాపై యుద్ధంలో 50 లక్షల కొరియను ప్రజలు మృతిచెందారు.

దీనితో ఉత్తర కొరియా స్వీయరక్షణకు చర్యలు తీసుకుంది. అమెరికా దిగ్బంధనంతో ప్రజల కనీస అవసరాలు తీర్చడానికి కష్టాలు పడుతూనే సైనిక సంపత్తిని పెంచుకుంది. అణ్వాయుధాలను, క్షిపణులను తయారుచేసుకుని, ఎదురుదాడికి సంసిద్ధంగా వుంది. కొరియా పలు దురాక్రమణలకు గురైంది తప్ప ఏనాడూ దురాక్రమణకు పాల్పడలేదు.

కాగా, అణ్వాయుధాలూ, క్షిపణులూ గుట్టలుగా కలిగి వున్న అమెరికా సామ్రాజ్యవాదం ఉత్తర కొరియాను నిందించటం గర్హనీయం. కిలోమీటరు వ్యాసార్థం పరిధిలో సర్వాన్ని విధ్వంసం చేసే “తల్లి బాంబు”ను ఆఫ్ఘనిస్తాన్ గ్రామంపై ప్రయోగించి బల ప్రదర్శన చేసి అమెరికా ప్రపంచ ప్రజలను బెదిరించడానికి పూనుకుంది. ఉత్తర కొరియాపై అమెరికా సామ్రాజ్యవాదుల కాలు దువ్వే చర్యలను తీవ్రంగా ఖండించాలి. ఉత్తర కొరియాకు సంఘీభావం తెలపాలి. కొరియా నుండి తప్పుకొనమని అమెరికాను డిమాండు చేయాలి.

oooooo